# ధర్మరాజు

ఈసారి కాలేజీ శలవలకి చింతలపూడికెళ్ళాలనుకొన్నాడు చిట్టబ్బాయి. ఆరేళ్ళయింది దేవుడమ్మని చూసి. దేవుడమ్మ చిట్టబ్బాయికి వరసకి బాబాయి. బంధుత్వం కాస్త దూరం. దేవుడమ్మ భార్య పెళ్ళయిన కొత్తలోనే కామెర్లతో చచ్చిపోయింది. అప్పటినుంచీ మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు దేవుడమ్మ. సత్తెకాలపు మనిషి. రెండెకరాల చెక్కా దున్నుకొంటూ గుట్టుగా బతుకుతున్నాడు ఆ చిన్న పల్లెలో. చిట్టబ్బాయి ఊళ్ళో అడుగుపెట్టేసరికి ఆ ఊరు నలభై యేదు గడపా గుప్పుమంది ఆ వార్త. ఏదో పొలం తగాదాలో మొదటిసారిగా దేవుడమ్మ నోరెత్తి కరణంగారితో మాట్లాడాడట. కరణంగారు మరోమాట లేకుండా చేతికర్రతో దేవుడమ్మని చావబాదాడట.

కరణంగారిని ఆ చుట్టపక్కలంతా అక్రూరుడంటారు. అసలు పేరు మహాదేవ శాస్త్రి. అనుకోడానికి కారణం– అతని రెండు కాళ్ళూ చిన్నతనంనుంచీ పనిచెయ్యవు. ఎప్పుడూ ఇంటిముందు వసారాలో మందసా కూర్చీలో దుశ్శాలువ కాళ్ళమీద కప్పుకొని కూర్చుని వుంటాడు. లౌక్యానికి, దుర్మార్గపు ఆలోచనలకీ, మూర్ఖత్వానికీ, ఉబ్బసానికీ అక్రూరుడు పెట్టింది పేరు. ఆ ఊళ్ళో అబ్రాహ్మణుల కొంపలు కేవలం రెండు మూడే వున్నాయి. వాళ్ళ మీద బ్రాహ్మణుల అరాచకానికి అడ్డూ ఆపూ లేదు. వాళ్ళకి పెద్ద మద్దతు అక్రూరుడు. కొంత పొలానికి నీళ్ళగురించి మాటామాటా వచ్చింది. ఎప్పుడూ మెత్తగా వుండే దేవుడమ్మ మొదటిసారిగా నోరు విప్పాడు. ఎప్పుడూ లౌక్యంగా పనులు జరిపించే అక్రూరుడు మొదటి సారిగా కర్రెత్తాడు....

చిట్టబ్బాయి వస్తాడని దేవుడమ్మ అనుకోలేదు. ఊహించలేదు. ఇంటిముందు నులకమీద బోర్లా పడుకొని జీతగాడిచేత వీపుకి తగిలిన దెబ్బలకి నూనె రాయించుకొంటున్నాడు. మొదట చిట్టబ్బాయిని చూసి నిర్ఘాంతపోయాడు దేవుడమ్మ. తనే ఏదో తప్పు చేసినట్టు కుంచుకపోయాడు. ఇదిక్కడ మామూలేరా—అని సర్ది చెప్పబోయాడు. మరీ చిట్టబ్బాయి గుచ్చి గుచ్చి అడిగితే పసివాడిలాగా బావురుమన్నాడు దేవుడమ్మ. "కరణం యింటికి పిలిపించి చేతికర్రతో చావగొట్టాడురా" అని ఆరేళ్ళ కుర్రాడు చెప్పినట్టు చెప్పాడు.

బాబాయినిచూసి గుండె కదలిపోయింది చిట్టబ్బాయికి. అక్రూరుడిని తనెప్పుడూ చూడలేదు. కాగా, పల్లెటూరి రాజకీయాలు, అరాచకం అతనికి తెలీదు. ఒక్కటి మాత్రం తెలుసు. తనకి యిలాంటిదేదో జరిగే వుంటే తిరిగి అక్రూరుడిని చావగొట్టేవాడు. తక్కువ కులం వాడు కావడం, ఒంటరి వాడు కావడం, తమకి బలగం ఎక్కువ వున్నా తిరగుబాటు చెయ్యలేని వాళ్ళ బలహీనత—యివన్నీ మహదేవశాస్త్రిని బలవంతుడిని చేశాయి.

"పంచాయతీ పెట్టించు బాబాయి" అన్నాడు చిట్టబ్బాయి.

దేవుడమ్మ నిట్టూర్చాడు. "నన్ను కొట్టినప్పుడు వూళ్ళో పెద్దలు పదిమందికి పైగా ఉన్నారు. కొట్టిన విషయం అరగంటలో – అయిదారు వూళ్ళకి పాకింది. ఇక్కడ అక్రూరుడు చెప్పింది న్యాయం. చేసింది ధర్మం. అడిగే నాథుడు లేడు. వీపుకి కదా దెబ్బలు? ఈ సంవత్సరం పంట పోయిందనుకుంటాను. వాళ్ళ నోళ్ళలో నోరు పెట్టి బతకలేం. ఆ సంగతి మరిచిపో" అన్నాడు.

ఆగలేక పోయాడు చిట్టబ్బాయి. చరచరా అక్రూరుడి యింటిని వెదుక్కుంటూ వచ్చాడు. బుర్ర మీసాల్తో, ఎర్రకావితో గంభీరంగా వున్నాడు అక్రూరుడు. కాళ్ళు లేవుకాని, నిలబడితే ఆరున్నర అడుగుల మనిషి. గంభీరమయిన గొంతు, చుట్ట. బొద్దుగా వున్న కనుబొమ్మల కింద చింతగింజల్లాగ చిన్న కళ్ళు. "ఎవర్రా నువ్వు?" అన్నాడు నిర్లక్ష్యంగా.

"దేవుడమ్మ కొడుకుని"

"ఆ లంజా కొడుక్కి ఓ కొడుకున్నాడని తెలీదే. ఎప్పుడు పుట్టావు? ఎవరికి పుట్టావు" – అలా అనగలిగినందుకే అక్రూరుడికి నవ్వొచ్చింది. పక్కనున్న అయిదారు మంది పెద్ద మనుషులు ఫక్కుమన్నారు. అందరి మధ్యా ఎలకలాగ వున్నాడు చిట్టబ్బాయి. ఆవేశంలో వచ్చాడేకాని వచ్చి ఏం అడగాలనుకొన్నాడో, ఏం చెప్పాలనుకున్నాడో అతనికే తెలీదు. ఆ వసారాలో నిలబడ్డాక తన చిన్నతనం కొట్టవచ్చినట్లు కనిపించింది. పందొమ్మిదేళ్ళ కుర్రాడికి ఏభైయ్యో పడిలో ఉన్న అక్రూరుడు– ఎట్టి పరిస్థితుల్లోనూ సముజ్జీకాదు.

"మా బాబాయిని కొట్టారట కదా?"

" అవును కొట్టాను. ఏం చేస్తావు?"

"ఇది అన్యాయం"

"న్యాయం గురించి నీకేం తెలుసురా కుర్రనా కొడకా. అన్యాయమని చెప్పడానికి నా

గడపలోకి వచ్చావా? రెండు నిముసాల్లో ఊరు వదిలి పోకపోతే మీ బాబాయిని కొట్టానుకొని నీ కాళ్ళు విరగ్గొట్టించి అరటి తోటల్లో పారేయిస్తాను. పీక్కో” అన్నాడు.

“చేసిన పనికి క్షమాపణ చెప్పమని అడగడానికి వచ్చాను” అన్నాడు చిట్టబ్బాయి. అదీ ఆలోచించి అన్నమాట కాదు. ఏమనాలో తెలీక నోటికొచ్చిన మాట.

అక్రూరుడికి అంత శక్తి ఉందని ఆ క్షణందాకా తెలీలేదు. అంత మనిషి కుర్చీలోంచి ఒక్క దూకుడుగా లేచి చెళ్ళున చెంపమీద కొట్టాడు.

పందొమ్మిదేళ్ళ లేత శరీరం తూలి పందిరిరాటకి తల కొట్టుకుంది. కళ్ళు బైర్లు కమ్మాయి.

రకరకాల బూతులు తిడుతున్నాడు అక్రూరుడు. రెండు కాళ్ళూ ఉండి ఉంటే కాళ్ళతో కుమ్మేసేవాడు. పక్కనున్న వాళ్ళంతా వొణికిపోయి చూస్తున్నారు. జీతగాళ్ళు చిట్టబ్బాయిని చెరో రెక్కా పట్టుకున్నారు. అక్రూరుడి గొంతు ఎంత లేదన్నా నాలుగు వీధులకి వినిపించేంత లేచింది.

“నేను నీకు క్షమాపణ చెప్పాలిరా నీ....”యిలా సాగింది. తగిలిన దెబ్బకయితే కళ్ళనీళ్ళు తిరిగాయికాని, రక్తం కళ్ళల్లోకి ఎగదన్ని పౌరుషం ముంచుకొచ్చింది చిట్టబ్బాయికి. ఈ దుర్మార్గం తనకి కొత్తగాని, దుర్మార్గాన్ని ఎదిరించే తన పౌరుషం తనకి కొత్తకాదు. జీతగాళ్ళని విదిలించుకున్నాడు. అక్రూరుడు మీదకి వెళ్తాడేమోనని వాళ్ళు పెద్దాయిన వేపు రెండు అంగలు వేశారు. ఓ విధంగా చూసేవాళ్ళకి ఆ కుర్రాడిమీద జాలి వేసింది. అయినా అవాక్కయి చూస్తున్నారు. ఏం చేస్తాడు కుర్రాడు?

చిట్టబ్బాయి ఏడుపులాంటి గొంతుతోనే అన్నాడు. “నీ కాళ్ళు విరగ్గొడతానని అందామని వుంది. కాని నీకు కాళ్ళు లేవు. నాకు కళ్ళున్నాయి. నీకు కాళ్ళు లేకపోయినా నన్ను వెదుక్కుంటూ వచ్చి నా కాళ్ళు పట్టుకొని క్షమాపణ చెప్పుకొనేటట్టు చేస్తాను”

చింతలవలస వూరంతా అక్రూరుడి అరుపుకి వొణికింది. చిట్టబ్బాయి అదృష్టం అక్రూరుడికి కాళ్ళు లేకపోవడమే. ఎందుకంటే– ఆ మాట పూర్తవుతూనే అక్కడినుంచి పరిగెత్తి పోయాడు చిట్టబ్బాయి. అతని చేతికి దొరికివుంటే –పందిరిరాటకేసి కొట్టి చేతుల్తో చంపేసేవాడు.

మరోగంటకి వూరొదిలి వెళ్ళిపోయాడు చిట్టబ్బాయి. ఒంటరిగా కాదు. దేవుడమ్మతో.

కరణంగారింట్లో జరిగిన విషయం తెలియగానే–దేవుడమ్మ పసిపిల్లాడిలాగ ఏడ్చాడు. ఒంటికి తగిలిన దెబ్బల్ని మరిచిపోయి, ముందు ముందు జరగబోయే అనర్థాల్ని తలుచుకు ఏడ్చాడు.

“ఎంత పని చేశావురా. అసలు నిన్నక్కడికి ఎవరు వెళ్ళమన్నారు? నీకేం? నువ్వు యివాళ పోతావు. రేపటినుంచీ నా బతుకు కుక్క బతుకయి పోతుంది. అక్రూరుడు నన్ను పసుపుముక్కల్ని పెట్టి చంపిస్తాడు” అంటూ ఏడ్చాడు.

ఆవేశంలో తిట్టాడేకాని అక్రూరుడికి భయంగానే వుంది. దేవుడమ్మ చెప్పిన మాటల్లో అక్షరం పొల్లుపోదని తనకి తెలుసు. బాబాయి హత్య గురించి వినడానికి యిర్వై నాలుగు గంటలు చాలు. అందుకే దేవుడమ్మని తీసుకొనే బయలుదేరాడు. మొదట రానన్నాడు దేవుడమ్మ. ఆ వూళ్ళోనే తన పొలం ఉంది. తను అక్కడే పుట్టాడు. పెళ్ళాన్ని అక్కడే బుగ్గిచేశాడు. అక్కడే ఏభై ఏళ్ళ జీవితం గడిచిపోయింది. కేవలం ఓ పందొమ్మిదేళ్ళ కుర్రాడి తొందరపాటుకి వూరు వొదిలి పోవాలని లేదు. వెళ్ళి అక్రూరుడి కాళ్ళమీద పడి అవసరమయితే మరోవిడత దెబ్బలు తిని తన ఉనికిని కాపాడుకోవాలని లేచాడు దేవుడమ్మ. కాని చిట్టబ్బాయి అడ్డుపడ్డాడు. "ఆరు నెలలు తిరగకుండా అక్రూరుడే స్వయంగా వచ్చి నిన్ను వూరుకి తీసుకొచ్చేటట్లు చేస్తాను బాబాయి–నాతోరా" అన్నాడు. రెండో గంటకి దేవుడమ్మ జీవితంలో మొదటిసారిగా వూరు దాటాడు. బండి రోడ్డుమీద నడుస్తున్నప్పుడే తన రెండుకరాల చెక్కనీ అక్రూరుడి మనుషులు ఎడ్లతో కుమ్మించి ధ్వంసం చెయ్యడం చూశాడు. అక్రూరుడు పగ తీర్చుకుంటున్నాడు. బ్రతికుండగానే తనకెవరో నిప్పు పెడుతునట్టనిపించి బండిలో బావురుమన్నాడు దేవుడమ్మ.

శలవులకి ఏదో వూసుపోకకి వచ్చి ఒక మనిషి జీవితంలో అనవసరంగా కలత చేసినందుకు బాధపడిపోయాడు చిట్టబ్బాయి. అసలు వ్యవహారం ఇంతవరకు వస్తుందనుకోలేదు. నాలుగు వూళ్ళవతల తనకు తెలిసిన ఓ మోతుబరి యింట్లో దిగారిద్దరూ. హఠాత్తుగా రావడానికి ఏం కారణం చెప్పాలో తెలీలేదు. కాని చెప్పాల్సిన అవసరం కూడా రాలేదు. మోతుబరి బాగా సంపన్నుడు. ఇద్దరికి భోజనం పెట్టడం, అతిథ్యం యివ్వడం కష్టంకాదు. అసలు పట్నమే వెళ్ళొచ్చు కదా? వెళ్ళకూడదని రూఢిగా నిర్ణయం తీసుకున్నాడు చిట్టబ్బాయి. ఊరుకి దగ్గరగానే ఉంటూ ఏదో చెయ్యాలి.

కాని ఏం చెయ్యాలి? పునాదులు వేసుకొని బలంగా పాతుకుపోయిన అక్రూరుడి వంటి శ్రీమంతుడినీ అహంకారినీ తనేం చెయ్యగలడు? తన కాళ్ళ దగ్గిరికి ఎలా తీసుకువస్తాడు? ఆవేశంలో అనడానికి బాగానే ఉందికానీ, ఆచరణలో ఏం చెయ్యాలో తెలియలేదు. కాగా దేవుడమ్మ అక్రూరుడి చేతుల్లో దెబ్బలు తిన్నప్పటికన్నా మరీ దారుణంగా నీరుకారిపోయాడు.

"ఆరునెలల్లో అనుకొన్నది సాధిస్తాను. నిన్ను వూరు తీసుకువెళ్తాను బాబాయి" అని వూరడించాడు కాని, ఆ మాటల్లోనూ ధైర్యం, నమ్మకంలేని విషయం తనకే తెలుసు.

మధ్య మధ్య ఆ వూరు వార్తలు వింటున్నాడు. ఎక్కడో మారుమూల పల్లెటూరు పాకుడు పట్టిన దిగుడుబావిలాంటిది. దాంట్లో ఏవిధమయిన జలచరమూ వుండదు– ఎప్పుడన్నా కప్పలో పురుగులో ఒళ్ళు సవరించుకొంటే తప్ప. నాలుగు నెలల తర్వాత ఓ విషయం తెలిసింది. అక్రూరుడు ఒక్కగానొక్క కూతురి పెళ్ళవుతోందని. జబల్పూరులో రోడ్ల ఇంజనీరు కొడుక్కిచ్చి చేస్తున్నాడు. అబ్బాయి పెద్ద చదువుకోలేదు. అక్రూరుడు ఆస్తిపాస్తుల్ని దృష్టిలో పెట్టుకొని, ఇల్లరికాన్ని దృష్టిలో పెట్టుకొని అల్లుడు పెద్దగా చదువుసంధ్య

లేనివాడిని చూసుకొని జాగ్రత్త పడ్డాడు అక్రూరుడు. అమ్మాయి చిన్నపిల్లే. కుర్రాడు కూడా యిరవై మూడేళ్ళవాడు. పెళ్ళికి చుట్టుప్రక్కల వూళ్ళన్నీ కలిసిపోయాయి. ఏ యింట్లోనూ పొయ్యిలోంచి పిల్లి లేవలేదు. భోగం మేళాలూ, హరికథలూ, తోలుబొమ్మలాటలు పెట్టించాడు అక్రూరుడు. గ్యాసు లైట్లతో వూరు దేవేంద్ర నగరంలాగ వెలిగిపోయింది. మరీ చిన్నవాళ్ళు అక్రూరుడు మొదటిసారిగా యిల్లువదిలి వూరేగింపులో రావడం చూశాడు.

'రెండోసారి నా దగ్గరికి రావడానికే' అనుకున్నాడు చిట్టబ్బాయి. ఆవేశం తనని ఆలోచింపచేస్తోంది. పెళ్ళయిన పదోరోజు పనికట్టుకొని పెళ్ళాంతో పట్నం హనీమూన్ వచ్చిన పెళ్ళికొడుకుని కలిశాడు. పేరు చంద్రశేఖర్. చూసి ఆశ్చర్యపోయాడు. మరీ పదహారేళ్ళ కుర్రాడిలాగ వున్నాడు. రెండు సార్లు పలకరిస్తేనే కాని ఏ సమాధానం చెప్పలేనంత సాధువు.

"చూసి చూసి ఈ దరిద్రపు సంబంధానికి ఎలా ఒప్పుకున్నావయ్యా"

"మా నాన్న ఒప్పుకోమన్నాడండి"

"ఇల్లరికానికి ఎందుకు అంగీకరించావు"

'మా నాన్న చెప్పాడండి"

"ఎందుకు చదువుకోలేదు"

"మా నాన్న చదువక్కరలేదన్నాడండి" ఇలా సాగింది సంభాషణ.

కలిసిన మొదటి గంటలోనే దోస్తీ కలిపేశాడు చిట్టబ్బాయి. వాళ్ళ మామగారిని తెలుసన్నాడు. పెళ్ళి గురించి విని కలుసుకోవడానికి వచ్చానన్నాడు. ఆ రాత్రి చంద్రం జీవితంలో మొదటిసారిగా తాగాడు. ఉత్తగా కాదు. తప్పతాగి హోటల్ గదికి వచ్చి పడిపోయాడు. అక్రూరుడి కూతురు నాగమణి కంగారు పడిపోయింది. భర్త జబల్పూర్ అలవాట్లు తనకి తెలీవు. తాగడం నగరం సంస్కారంలో భాగమని సరిపెట్టుకోవడం తెలీదు. ఆ రాత్రంతా స్పృహ లేకుండా పడివున్న భర్త పక్కన కూర్చుని భోరుమని ఏడ్చింది. అయిదు రోజుల తరువాత వూరొచ్చాక ఆ విషయం తెలిసినప్పుడు మహదేవశాస్త్రి గుండెల్లో మొదటి దెబ్బ తగిలింది. ఆ విషయం విని వరండాలో కుర్చీ చెయ్యి అతని కోపానికి విరిగి ముక్కలయిందని తెలిసినప్పుడు చిట్టబ్బాయికి ఎక్కడ లేని బలం వచ్చేసింది.

నెల రోజులు తిరక్కుండా చంద్రశేఖర్ చేత బులెట్ మోటారు సైకిలు కొనిపించాడు చిట్టబ్బాయి. ఊరు శివార్లలో తాటితోపు దాటగానే రోడ్డు. రోజూ సాయంకాలం ఆరు దాటాక మల్లెపువ్వులాంటి చొక్కా వేసుకొని బులెట్‌మీద వచ్చేసే వాడు చంద్రం. పెద్దాపురంలో బిజినెస్ దెబ్బతిని ప్రస్తుతం పట్నంలో స్థిరపడ్డ కాంతామణి దగ్గర ఖాతా పెట్టించాడు. కాంతామణి చంద్రంకంటే రెండేళ్ళు పెద్దది. గడుసుది. మగాళ్ళు ఆడదాని నుంచి ఏమాశిస్తారో వయసొచ్చినప్పటినుంచి స్వానుభవంతో తెలుసుకొన్న పిల్ల. చంద్రశేఖరాన్ని రెండోరోజునే పడగొట్టేసింది. కాంతామణి కౌగిట్లో ఇరుక్కొన్నాక చంద్రం మనిషి రక్తం

మరిగిన పులి అయిపోయాడు. ఆమె రుచి మరిగాక చంద్రం ఏ రాత్రీ పల్లెటూళ్ళో గడపలేదు. అక్రూరుడికి ఈ సంగతి తెలియడానికి రెండు మూడు వారాలు పట్టింది. అప్పటికి పెళ్ళిలో పిల్లకి తొడిగిన కాసులు పేరూ, రవ్వల గాజులూ – కాంతామణి వొంటిమీదకి వచ్చేశాయి. అల్లుడి విషయం తెలిశాక అక్రూరుడు మొదట మండిపడ్డాడు. పెద్ద హడావుడి చేశాడు. మామని నాలుగు మాటలు తిట్టనిచ్చి "నా యిష్టం" అన్నాడు. అంతే. చెళ్ళున చెంప పగలగొట్టాడు మహాదేవశాస్త్రి. తనని కాదన్న వాళ్ళకి ఆ సత్కారం చెయ్యడం శాస్త్రికి జన్మతః అలవాటు. కాని ఆ దెబ్బ కూతురు గుండెల్లో పేలింది. పెళ్ళాన్ని తీసుకొని జబల్పూర్ పోతానని పట్టుబట్టాడు చంద్రం. చేసిన పొరపాటు తెలుసుకొని రహస్యంగా అల్లుడు చేతులు పట్టుకుని బతిమాలుకొన్నాడు మహాదేవశాస్త్రి. ఆ రాత్రి మువ్వల వడ్డాణం కాంతామణి నడుంని అలంకరించింది.

ఓ రోజు డోసు ఎక్కువయి కాంతామణి యింట్లోనే మూడోఝాము గడిపేసి యింటికి వస్తుండగా కంకర రోడ్డు మీద బులెట్ తప్పటడుగు వేసింది. చంద్రంకి కాలు విరిగింది. ఆ తర్వాత పట్నం నర్సింగ్ హోమ్‌లో 2 నెలలు ఉన్నాడు. ఈపాటికి ఊరు ఊరంతా అక్రూరుడి ఒక్కగానొక్క అల్లుడు చేస్తున్ననిర్వాకం గుప్పుమంది. ఊరు వాళ్ళకి అన్నం తిన్న చేతులు యింకా ఆరలేదు. పప్పుదప్పళాల రుచి యింకా గొంతులోనే ఉంది. ఆ గొంతులతోనే అక్రూరుడి ఇల్లు క్రమంగా వల్లకాడవుతున్న విషయం కథలుగా చెప్పుకున్నారు. అల్లుడికి కాలు బాగయి చేతికర్ర పట్టుకు నడుస్తూ యింటికి వచ్చే వేళకి అక్రూరుడికి మొదటిసారిగా గుండె నొప్పి వచ్చింది. పావుగంట ఆలశ్యం అయితే ప్రాణానికే ముప్పు వచ్చేదన్నారు డాక్టర్లు. పట్నం ఆస్పత్రికి అంబులెన్సులో మోసుకెళ్ళారు. ఆరు రోజులపాటు పైవాళ్ళని ఎవర్నీ లోపలికి రాకుండా ఆపారు. మెల్లగా ప్రాణం నిలదొక్కుకున్నాడు అక్రూరుడు.

అయిదారు నెలలకి చరాస్థి దాదాపు చాలామట్టుకు కాంతామణి యింటికి చేరిపోయింది. కాంతామణి మీద మోజు కూడా చంద్రానికి తగ్గుతూ వచ్చింది. అయితే ఈపాటికి సిగరెట్లు, జర్దాకిళ్ళీ, తాగుడు నిలకడగా స్థిరపడిపోయాయి.

చెరుకు అయివేజు పట్టుకొని మొదటి సారిగా చంద్రంతో మద్రాసులో దిగాడు చిట్టాబ్బాయి. ఆమ్మాయి మారింది. భాష మారింది. దేశం మారింది. చెరుకు అయివేజు హారతి కర్పూరం కావడానికి యిరవైరోజులు మాత్రమే పట్టింది. రోజూ బజారుకి తీసుకెళ్ళి కుర్రాడు ఆశ్చర్యంగా చూసినవి, కావాలనుకున్నవీ అవసరమా, కాదా అనే ఆలోచన లేకుండా కొనిపించాడు. ఎక్కువ రోజులు పగలంతా కాసిచెట్టి వీధిలో, రాత్రిళ్ళంతా రకరకాల అమ్మయిల యిళ్ళలో గడిచాయి. హొటలు గది నిండా రకరకాల చెప్పులు, ట్రాన్సిస్టర్లు, సెంట్లు, విదేశీ సబ్బులు, వస్తువులు, సీమ విస్కీలూ కన్నుల పండుగగా వుంది. చేతిలో డబ్బయిపోయాక యింటికి వెళ్ళనన్నాడు చంద్రం. హొటల్‌కి తొమ్మిది వేలు కట్టాలి. ఈ

ఇరవై రోజులూ తనెక్కడ ఉన్నదీ యింటికి తెలియనివ్వలేదు. మరికొస్త డబ్బుంటే రూటు మార్చి మళయాళ దేశం వెడదామన్నాడు చిట్టబ్బాయి. ఉత్సాహపడ్డాడు చంద్రం. హొటల్ గది అలాగే వుంచి యింటికి బయలుదేరాడు.

పెళ్ళాం కూడా ఈపాటికి రాటుదేరిపోయింది – "డబ్బు లేదండీ" అంది. లేదంటే ఏం చెయ్యాలో యిదివరకే చంద్రంకి అర్థమయిపోయింది. చాచి లెంపమీద కొడితే జబ్బుతో తీసుకుంటున్న తండ్రి మంచం ప్రక్కన పడింది. అయిదు నిముషాలు తిరక్కుండా తండ్రి గల్లాపెట్టి తాళం చెవులు అల్లుడు చేతిలో ఉన్నాయి. మరో అయిదు గంటల్లో మామిడితోట దస్తావేజులు మద్రాసు మర్వాడి దుకాణంలో ఉన్నాయి. ఆస్తికి ఏకైక వారసుడిగా చంద్రం చేత కొలేటరల్ సెక్యూరిటీ మీద సంతకం చేయించి, దస్తావేజులుతోపాటు, ఆ కాగితాన్ని జతచేసి పాతికవేలు యిప్పించాడు చిట్టబ్బాయి.

తిరుచూరులో రెండు వారాలు ఒళ్ళు మరిచిపోయాడు చంద్ర. అతన్ని అక్కడే వదిలేసి మళ్ళీ వస్తానని యింటికి వచ్చాడు చిట్టబ్బాయి. ఈ వ్యవహారాలన్నీ దేవుడమ్మకి తెలియడంలేదు. దిగులుగా యింటిపట్టునే ఉంటున్నాడు. చుట్టం చూపుకని వచ్చి ఒక గది అద్దెకు తీసుకుని ఇక్కడే ఎందుకు వుంటున్నాడో మోతుబరికి అర్థం కాలేదు. చిట్టబ్బాయి ఊళ్ళోకి వచ్చేసరికి మరోవార్త గుప్పుమంది. అక్రూరుడికి రెండోసారి గుండెపోటు వచ్చిందని, ఈసారి పట్నం వెళ్ళడానికి ఒప్పుకోలేదని, మర్నాటికి సర్దుకుందని. అల్లుడెక్కడున్నాడో తెలీక మనుషుల్ని పెట్టి వెదికిస్తున్నాడు. కూతురు రాత్రీ పగలూ గదిలోనే ఏడుస్తూ కూర్చుంటోందట.

మూడోరోజు రాత్రి నడిఝాము దాటాక ఆరుబైట మంచంమీద పడుకున్న చిట్టబ్బాయికి దూరంగా ఎడ్ల గంటల చప్పుడు వినిపించింది. ఆ శబ్దం దగ్గరవుతున్న కొద్దీ దేవుడమ్మకి తెలివొచ్చింది. బండి వచ్చి యింటిముందే ఆగింది. ఇద్దరు పాలేరులు సాయం పట్టగా చెట్టంత అక్రూరుడు పిట్టలాగ బండి దిగాడు. అతన్ని చూస్తూనే నిర్ఘాంతపోయాడు చిట్టబ్బాయి. తనని చెంప దెబ్బ కొట్టాక అక్రూరుడికి ఎదురుపడి ఎప్పుడూ చూడలేదు. ఆరడుగుల మనిషి కృంగిపోయి నేలకంటుకుపోయినట్టున్నాడు. దబ్బపండు ఛాయ పోయింది. శరీరం కమిలిపోయింది. గడ్డం బాగా పెరిగింది. రెండు గుండెపోట్లకంటే కూతురు కాపురం, పదిమందిలో జరిగిన రచ్చ మనిషిని తోసేసింది.

అక్రూరుడిని చూస్తూనే దేవుడమ్మకయితే ఏడుపొచ్చింది. పంతం నెగ్గించుకోవాలని పట్టుబట్టాడే కాని, అంత మనిషీ ఇలా అర్థరాత్రి వస్తాడని కలలో కూడా అనుకోలేదు చిట్టబ్బాయి. అతన్ని చూస్తే జాలేసింది. మహాదేవ శాస్త్రిలో మునుపటి అహంకారం లేదు. ఇద్దరు పాలేర్లు పట్టుకురాగా లోపలికి వచ్చి నులకమంచంమీద కూలబడ్డాడు. చిట్టబ్బాయి, దేవుడమ్మ మొహాలు మార్చి మార్చి చూసి ఒక్కసారి భోరుమన్నాడు. ఆ దృశ్యం చూశాక చిట్టబ్బాయికే గుండె కరిగిపోయింది.

"నువ్వు కోరుకొన్నట్టు వచ్చానురా అబ్బాయి. నేను నీ చెంప మీద కొట్టాను. చిదికిపోయాను. ఎక్కువకాలం బతకను. నేను నీ కాళ్ళు పట్టుకోవడం నీకు ఆయుక్షీణం. అయినా పట్టుకుంటున్నాను. నా కూతురు కాపురాన్ని రక్షించు" అంటూ నులకమంచం మీంచి అమాంతం చిట్టబ్బాయి కాళ్ళమీదకి వాలిపోయాడు.

వచ్చిన పాలేళ్ళిద్దరూ భోరుమన్నారు. చిట్టబ్బాయికే కళ్ళనీళ్ళు తిరిగాయి.

"అయ్యగారు! ఆగమన్నారు కనక కానీ, అల్లుడిగారి బుద్ధి పాడుచేసింది నువ్వేనని తెలిశాక మేమే నరికేసే వాళ్ళం. చిన్న పుట్టుక పుట్టి పెద్దోళ్ళ బతుకులమీద కొడతావ్రా దొంగ గాడిదకొడకా" అన్నాడు పాలేరు రోషంతో ఉండబట్టలేక.

అక్రూరుడు వాడిని ఆపాడు. చిట్టబ్బాయికి కోపం రాలేదు. తన ఆవేశంలో తను తీసిన దెబ్బ ఎంత బలమయినదో అప్పుడు తెలిసొచ్చింది. ఎవరినో కొట్టబోయి అభం శుభం తెలీని ఆడపిల్లని కొట్టానని కూడా అనిపించింది.

"ఇదంతా నాకు తెలియదయ్యగారు! కుర్రాడు తొందరపడ్డాడు. ఏమీ అనుకోకండి" అని ఏడ్చాడు దేవుడమ్మ.

"వాడు కుర్రాడు కాదురా. ధర్మరాజు. శిక్ష వెయ్యడంలో దయాదాక్షిణ్యం చూపించలేదు. అబ్బాయి, ఈ శిక్ష నాకు చాలు. ఆస్తి నాకక్కర లేదు. అల్లుడు ఎక్కడున్నాడో చెప్పు. వెళ్ళి తెచ్చుకుంటాను" అని దేవుడమ్మ వేపు తిరిగి "నీ పొలంలో పెసర వేయించాను. సాయంకాలం దగ్గరుండి నీ యిల్లు కడిగించి ముగ్గులు వేయించాను" అన్నాడు.

దేవుడమ్మ ముఖం చేటంతయింది.

"మీరు వెళ్ళండి. అల్లుడిని తీసుకొని నేనొస్తాను. మీ గుమాస్తాని రేపు నా దగ్గరకి పంపండి" అన్నాడు చిట్టబ్బాయి.

తిరుచూరులో ఆనందంలో మునిగి తేలుతున్నాడు చంద్రం. చిట్టబాయిని, గుమాస్తాని చూసి ఆశ్చర్యపోయాడు. హొటలు డబ్బు, చిల్లర ఖర్చులు అన్నీ గుమస్తాల చేత కట్టించి మద్రాసు వచ్చి మామాడితోట దస్తావేజులు విడిపించుకొని ఊరు రావడానికి అయిదు రోజులు పట్టింది. మద్రాసులోనే బులెట్‌ని అమ్మేశాడు చిట్టబ్బాయి.

చిక్కి నీరసంగా వున్న భర్తని వాటేసుకుంది అక్రూరుడి కూతురు. అక్రూరుడు కళ్ళలో నీళ్ళు తిరిగాయి ఆనందంతో. యింటి గేటుదాటి లోపలికి కూడా అడుగు పెట్టలేదు చిట్టబ్బాయి. గేటు దగ్గర నుంచే వెనక్కి తిరిగాడు.

—యువ, దీపావళి *1985*

----